క్లుప్తంగా

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



రాణెమ్మతో మాట్లాడుతున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్ : తిరుపతి శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కుంట్రపాకం అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి తల్లిదండ్రులు బుజ్జిరెడ్డి, రాణెమ్మను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మి పరామర్శించారు. బుధవారం వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం తప్పనిసరి



మాట్లాడుతున్న ఈఓ శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుమలలో శ్రీవారి భక్తులకు బిగ్, జనతా క్యాంటిన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడం తప్పనిసరని టీటీడీ ఈఓ శ్యామలరావు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో హోటళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం ప్రపంచ వ్యాప్తంగా భక్తులు వస్తుంటారన్నారు. వారికి సేవాభావంతో లాభాపేక్ష లేకుండా, నిర్దేశిత ధరలకే పరిశుభ్రమైన భోజనం అందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, అదనపు ఎఫ్ఏఓ రవి ప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

13లోపు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ సుబ్బారావు

తిరుపతి రూరల్ : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హుల జాబితా ఆయా సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నామని, అందులో పేరులేని అర్హులు ఉంటే ఈ నెల 13వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ సుబ్బారావు తెలిపారు. బుధవారం ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యాలయంలో అన్నదాతా సుఖీభవపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలోనే జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే 13వ తేదీలోపు ఆయా రైతు సేవాకేంద్రాల్లో అర్జీ పెట్టుకోవాలని సూచించారు.

దుకాణాల తనిఖీ



షాపులో తనిఖీ చేస్తున్న పోలీసులు

పాకాల : పాఠశాలల సమీపంలో నిర్వహిస్తున్న దుకాణాలను పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నోట్‌బుక్‌లు అందిస్తున్న డిప్యూటీ డీఈఓ బాలాజీ

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం కొర్లగుంటలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డీఈఓ బాలాజీ మాట్లాడుతూ పిల్లలు తమ చేతిరాతను చక్కదిద్దుకోవడం ద్వారా భవిష్యత్‌ను మలుచుకోవచ్చని సూచించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నీసాబేగం, ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషా, డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ పెన్షనర్ల సంఘ సమావేశం



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీయూ సమీపంలోని బ్యారక్స్‌లో బుధవారం ఆర్‌పీఎఫ్ పెన్షనర్ల సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. తిరుపతి శాఖ కార్యదర్శి మనోహరం అధ్యక్షత వహించిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, ఐపీఎఫ్ వెంకటేశ్వర్లు, జోనల్ లీడర్లు రాయుడు, వరప్రసాద్‌రెడ్డి, తిరుపతి శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రైల్వే పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పూలే విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల మానవహారం



టీటీడీ పరిపాలనా భవనం వద్ద ఉద్యోగుల నిరసన



కదంతొక్కిన కార్మికులు

సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుపతి.. చంద్రగిరి నియోజకవర్గాల్లో కార్మికులు కదం తొక్కారు. ఎక్కడికక్కడ ర్యాలీలు నిర్వహించారు. వివిధ సంఘాల నేతృత్వంలో ఆందోళనకు దిగారు. నల్లదుస్తులు ధరించి మానవహారంగా ఏర్పడ్డారు. కేంద్రం.. రాష్ట్రంలోని కూటమి సర్కారు విధానాలపై నిరసన తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలనపై మండిపడ్డారు. కార్పొరేట్లకు కొమ్ముకాసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ధర్నాలు చేపట్టారు. పనిగంటలు పెంచడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

- సార్వత్రిక సమ్మె విజయవంతం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై వెల్లువెత్తిన నిరసన
- కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం
- లేబర్ కోడ్ల రద్దుకు డిమాండ్



ఎస్వీయూ పరిపాలన భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి అర్బన్/తిరుపతి కల్చరల్/ తిరుపతి సిటీ/తిరుపతి అన్నమయ్యసర్కిల్/పాకాల : తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో కార్మిక సంఘాలు బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. అన్ని వర్గాలు సహకారంతో ర్యాలీలు నిర్వహించారు. మానవహారాలుగా ఏర్పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నేతలు ఎండగట్టారు. వెంటనే లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

– తిరుపతి బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం వద్ద సీఐటీయూ, ఆప్కాస్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, ఐద్వా, అంగన్‌వాడీ, పంచాయతీ వర్కర్ సంఘాల నేతలు నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు.

■ ఎస్వీయూ పరిపాలన భవనం ఎదుట విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నిరసనకు దిగింది. కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించింది.

■ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ, ఎన్ఎఫ్ఐఆర్, ఎస్‌సీఆర్ఈఎస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైల్వే ఉద్యోగులకు ఓపీఎస్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు,

■ సార్వత్రిక సమ్మెకు టీటీడీ ఉద్యోగులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు టీటీడీ పరిపాలన భవనం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

■ రామానుజ సర్కిల్ వద్ద యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. బ్యాంకులను మరింత బలోపేతం చేయడానికి సర్కార్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

■ పాకాల ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా నేత మధుసూదన్ రావు ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఆర్‌డీఓకు వినతిపత్రం అందించారు.



సమ్మెకు దిగిన బ్యాంక్ ఉద్యోగులు



ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నేతలు



నిరసన ప్రదర్శనలో రైల్వే ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు

తుడా అభివృద్ధికి కార్యాచరణ



సదస్సును ప్రారంభిస్తున్న తుడా చైర్మన్, వైస్ చైర్మన్

తిరుపతి తుడా : తుడా అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కచ్చపి ఆడిటోరియంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దివాకర్‌రెడ్డితో పాటు తుడా వైస్ చైర్మన్, జేసీ శుభం బన్సల్ హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని పంచాయతీల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పంచాయతీ పరిధిలో కార్యదర్శులు అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి, ఎలా అనుమతులు ఇవ్వాలి. భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి, డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ సురేష్ నాయుడు, మున్సిపల్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్, తుడా సెక్రటరీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రెడాయ్ ఎక్స్ పో బ్రోచర్ ఆవిష్కరణ



ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను అందజేస్తున తుడా చైర్మన్

తిరుపతి తుడా : నగరంలో త్వరలో జరగనున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్ పోనకు సంబంధించిన బ్రోచర్‌ను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం ఓ ప్రైవేటు హోటల్‌లో వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను క్రెడాయ్‌లో ఒక సభ్యుడని నేడు తుడా చైర్మన్ హోదాలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. క్రెడాయ్ లాంటి నమ్మకమైన సంస్థ ప్రజల అవసరాలను గుర్తించి నిర్మాణాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం క్రెడాయ్ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ గోపీనాథ్, ప్రెసిడెంట్ రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాజేష్ బాబు, కార్యదర్శి నరసింహారెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు

ముగిసిన పవిత్రోత్సవాలు



మహాపూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజులుగా సాగుతున్న పవిత్రోత్సవాలు బుధవారం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టుపవిత్ర సమర్పణ చేశారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమజనం, అనంతరం అలంకారం, సహస్రనామార్చన జరిపించారు. సాయంత్రం పంచమూర్తులైన శ్రీ కపిలేశ్వరస్వామి, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీవినాయకస్వామి, వల్లి, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యం, శ్రీచండికేశ్వరస్వామి వారు తిరువీధులలో విహరించారు.

అమ్మవారి సేవలో శివమణి



ఆలయం వెలుపల డ్రమ్స్ శివమణి

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారిని డ్రమ్స్ శివమణి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం సాయంత్రం సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 78,320 మంది స్వామి వారిని దర్శించుకోగా 24,950 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

సహకార సంఘాల కార్యవర్గం ఎంపిక




మల్లంగుంట సహకార సంఘం చైర్మన్‌గా మధుశేఖర్, ఎన్నికైన సభ్యులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని 7 సహకార సంఘాలకు చైర్మన్లు, కమిటీ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తిరుపతి రూరల్ మండలం పరిధిలోని తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని వారి పేర్లను ప్రకటించారు. యర్రావారిపాలెం సహకార సంఘానికి చైర్మన్‌గా ఎస్.రఘు, చిన్నగొట్టిగల్లు సహకార సంఘానికి ఎం.ప్రభాకర్, రామచంద్రాపురం సహకార సంఘానికి సి.జనార్ధన్‌చౌదరి, తిరుపతి రూరల్ మండలంలోని మల్లంగుంట సహకార సంఘానికి సి.మధుశేఖర్, చంద్రగిరి మండలంలోని ఐతేపల్లి సహకార సంఘానికి పల్లినేని సుబ్రమణ్యంనాయుడు, నరసింగాపురం సహకార సంఘానికి చైర్మన్‌గా ఆర్.వినోద్‌కుమార్, పాకాల సహకార సంఘం చైర్మన్‌గా కె.సావిత్రి, అలాగే సభ్యులను నియమించినట్లు ఆయన వివరించారు.

నేడు మధ్యవర్తిత్వంపై శిక్షణ

తిరుపతి లీగల్ : రాష్ట్ర, జిల్లా న్యాయసేవా సంస్థల ఆదేశాల మేరకు తిరుపతి, ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాల్లో గురువారం ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న మీడియేటర్స్‌కు మధ్యవర్తిత్వంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ తెలిపారు. ఈ కార్యక్రమం తిరుపతి మండల న్యాయసేవా అధికార సంస్థ, ఉమ్మడి చిత్తూరు జిల్లా మధ్యవర్తిత్వ కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 48 మంది న్యాయవాదులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని న్యాయమూర్తి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి



సుబ్రమణ్యా యాదవ్ (ఫైల్)

తిరుపతి లీగల్ : నగరంలోని న్యాయవాది ఎం. సుబ్రమణ్యం యాదవ్ రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందినట్లు న్యాయవాద సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు. రాజంపేట కోర్టుకు న్యాయవాది సుబ్రమణ్య యాదవ్, పీలేరు న్యాయవాది రాజగోపాల్ కారులో వెళుతుండగా ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు. ఇరువురూ మరణించినట్లు వివరించారు. ఈ మేరకు గురువారం ఉదయం 10:30 గంటలకు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాలులో సంతాప సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 8.30 గంటల నుంచి మహాచండీ హోమం.
- శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, సాయంత్రం 5 గంటలకు సీతారామలక్ష్మణుల ఊరేగింపు.
- ఎస్వీ ప్రాచ్యకళాశాలలో ఉదయం 11 గంటలకు వ్యాస మహర్షి జయంతి సభ.
- పౌర్ణమి సందర్భంగా రాత్రి 7 గంటలకు శ్రీగోవిందరాజస్వామివారికి గరుడ వాహన సేవ.
- చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సాయంత్రం 6.45 గంటలకు గురుపూజ, రమా రహిత సత్యనారాయణ వ్రత పూజలు.
- ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మీడియా సమావేశం.
- శృంగేరి మఠంలో సాయంత్రం 6.30 గంటలకు గురుపౌర్ణమి విశిష్టతపై శతావధాని ఉప్పల దడియం భారత్ శర్మ ప్రవచనం.

శ్రావణికి డాక్టరేట్



తిరుపతి సిటీ : పద్మావతీ మహిళా వర్సిటీ న్యాయశాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని కీచగారి శ్రావణికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ డి.సీతాకుమారి పర్యవేక్షణలో ‘పబ్లిక్ హెల్త్ అండ్ ద లా ఇన్ ఇండియా.. ప్రాబ్లమ్స్ అండ్ పర్స్ పెక్టివ్స్’ అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

రెండు దుకాణాల్లో చోరీ



వైన్‌షాప్ సీసీ కెమెరాలో నమోదైన ఆగంతకుడి చిత్రం

చంద్రగిరి : అంకాళమ్మదే వాలయం సమీపంలోని వారాహి సూపర్ మార్కెట్, అదే మార్గంలోని వైన్ షాపులో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సూపర్ మార్కెట్‌లో రూ.1.20లక్షల నగదు, 500 గ్రాముల వెండి అపహరణకు గురైనట్లు యజమాని శేఖర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే వైన్‌షాప్‌లో మంకీ క్యాప్ ధరించిన ఓ వ్యక్తి చొరబడి రూ.10వేలకు పైగా నగదు, నాలుగు మద్యం సీసాలు చోరీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే సీసీ కెమెరాల్లో ఆగంతుకుడి దృశ్యాలు నమోదయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షెల్టర్ కోసం వినతి



మాట్లాడుతున్న సంస్కార్ రాజేష్

తిరుపతి కల్చరల్: తర్పణ పూజలే వృత్తిగా జీవనం సాగించే పురోహితులకు కపిలతీర్థం ఆలయ ఆవరణలో ప్రత్యేక షెల్టర్‌ను టీటీడీ అధికారులు ఏర్పాటు చేయాలని కపిలతీర్థం బ్రాహ్మణ తర్పణ పురోహితుల సంఘం గౌరవాధ్యక్షుడు సంస్కార్ రాజేష్ విన్నవించారు. బుధవారం ఈ మేరకు సంఘం అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, కార్యదర్శిగా విజయకుమార్, ఉపాధ్యక్షుడిగా విజయభాస్కర్‌ను నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు మోహన్‌కుమార్, సుధీర్‌కుమార్, మురళీధర్ శర్మ, గురుమూర్తి పాల్గొన్నారు.

అల్పాహారం వితరణ



అల్పాహారం పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద పేదలకు అల్పాహారం వితరణ చేశారు. పద్మావతి మెడికల్స్ అధినేత ధీరజ్ సౌజన్యంతో సుమారు 325 మంది గర్భిణులు, సహాయకులకు అల్పాహారం అందించారు. అనంతరం వారికి షుగర్, బీపీ టెస్ట్‌లు ఉచితంగా చేశారు. లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ భాస్కర్ , అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సి. చక్రపాణి, కోశాధికారి పురుషోత్తం, రామారావు, మురళీధర్, లియో సభ్యులు భాస్కర్, చక్రి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం వద్ద చంద్రగిరి వైఎస్సార్‌సీపీ నేతలు



పాకాల మండలం శ్రేణులు



జగనన్న కోసం.. మేము సైతం!

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటన విచ్చేశారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. పోలీసుల ఆంక్షలను అధిగమించి అభిమాన నేతను కలుసుకున్నారు. తమ వెంట తీసుకెళ్లిన మామిడి రైతులను మార్కెట్ యార్డులోకి అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా ప్రజల తరఫున పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు.

– తిరుపతి రూరల్